GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

HAPPY Independence DAY
# క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 18-05-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# సన్‌డే



**దంచికొడుతున్న ఎండలు - మరింత పెరిగే అవకాశాలు**

**గంగాధర మండలంలో అత్యధిక ఉష్ణోగ్రతల**

ఇవేమి ఎండలు బాబోయ్ భరించలేక పోతున్నామంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈసారి మార్చి రెండు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండగా, మే మాసంలో మరింత పెరిగి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈనెల 25న రోహిణి కార్తె ప్రారంభమవుతుండగా 15 రోజుల నుంచే 40 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భరించలేని వేడిమితోనే తెల్లవారుతోంది. ఇక 10 గంటల నుంచే ఎండల తీవ్రత మరింత పెరిగి రాత్రి 7 గంటల వరకు కూడా వేడిమి తగ్గడం లేదు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పనిసరి అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వేడిమి, వడగాల్పులతో ప్రాణాలకు ముప్పు ఉంటుందని డాక్టర్లు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

గంగాధర మండలం బూరుగుపల్లిలో ఆదివారం అత్యధికంగా 42.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్, గంగాధర మండల కేంద్రం, చొప్పదండి మండలం ఆర్నకొండ, మానకొండూరు మండలం ఈదురుగట్టెపల్లిలో 42.2, రామడుగు మండలం గుండి, జమ్మికుంట మండలం కొత్తపల్లి-ధర్మారం 42.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో జనం ఇంట్లో ఉండలేక, బయటకు వెళ్లలేక వేడిమి నుంచి తట్టుకునేందుకు నానా యాతన పడుతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు పనిచేయడం లేదని, కొద్ది సేపటి తర్వాత ఫ్యాన్లు, కూలర్ల నుంచి వేడిగాలులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఏసీలు కూడా కొద్దిసేపు ఆఫ్ చేస్తే ఉండలేని పరిస్థితి ఉంది. ఏప్రిల్ 30 నుంచి ఎలినోనా ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైన నమోదవుతాయని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ వేత్తలు హెచ్చరించారు.

# రజకులను ఎస్సీలుగా గుర్తించి సామాజిక న్యాయం చేయాలని కోరిన గోపి రజక

3లో

- సమావేశంలో నేటికీ కుల వివక్షత ఎదుర్కొంటుంది రజకులేనా
- ప్రభుత్వం విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలన్న పేపర్ నర్సిములు
- ఫించన్, రెండు లక్షల రుణాలు మంజూరు చేయాలన్న బిజ్జారం నర్సిములు



8లో

# చౌటుప్పల్ పరిధిలో భారీగా గంజాయి స్వాధీనం

3లో



- 437.5 కిలోల గంజాయి పట్టివేత
- పరారీలో ఇద్దరు,ఇద్దరు నిందితులు అదుపులోకి...
- పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు...
- వివరాలు వెల్లడించిన సీఐ జి.మన్మధకుమార్

# ఇన్‌ఫ్లుయెన్సర్లపై

జగద్గిరిగుట్ట, మే17: పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్‌కు మద్దతుగా సోషల్‌మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన ఇన్‌ఫ్లుయెన్సర్లపై పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకూ14 మందిపై కేసు నమోదు కాగా, మొత్తం 50మంది వీడియోలను, అభ్యంతరకర కంటెంట్‌ను పోస్ట్ చేసినట్టు గుర్తించారు. సోషల్‌మీడియాలో తమపై వ్యతిరేక ప్రచారం చేయడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ గోప్యతకు భంగం కలుగిస్తున్న సోషల్‌మీడియా ఖాతాలలో కంటెంట్ తొలగించడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలికి వ్యతిరేక ప్రచారంపైనా జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ ప్రతినిధులు కూడా పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు ప్రచారంతో పోలీసులను, ప్రజలను పక్కదారి పట్టించేలా ఉన్న వీడియోలను పోలీసులు ఇప్పటికే కొన్నింటిని గుర్తించారు. అప్‌లోడ్ చేయడం, వాటిని ఉద్దేశపూర్వకంగా ఎక్కువసార్లు షేర్ చేసినవారి వివరాలను ఆరా తీశారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు



చేసిన తర్వాత నుంచి నిందితుడి అరెస్టు వరకూ.. కేసు తీవ్రత తగ్గేలా, బాధితురాలిని తప్పుబడుతూ పలువురు సోషల్‌మీడియా ఖాతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. నిందితునికి క్లీన్ ఇమేజ్ ఉన్నట్టు చూపే ప్రయత్నంలో డబ్బులు తీసుకొని ప్రచారం చేసినట్టు అనుమానిస్తున్నారు. నిందితులకు మద్దతుగా ప్రచారం, పోక్సో బాధితుల వివరాలు వెల్లడయ్యేలా చేయడం నేరం, సోషల్‌మీడియాలో పోక్సో కేసులో వ్యతిరేక ప్రచా రం చేసినవారిపై విచారణ చేసి ఉన్నదని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు.. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై కలెక్టర్ ప్రతిమా సింగ్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం మెదక్ జిల్లాలోని మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు శ్రీ సన్నాహక, శిక్షణ, ముద్రణా కార్యక్రమాలు, జూన్ 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సందర్శన, జూలై 24వ తేదీన పోలింగ్ కేంద్రాల హేతు బద్ధీకరణ, 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ నిర్వహించడం జరుగుతుందన్నారు. జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం ప్రక్రియ తరువాత అక్టోబర్ 1వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ 9553866388 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సందేహాలు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ నం. లో సంప్రదించవచ్చని తెలిపారు.

# 55 ప్రధాన ఆలయాల్లో పోస్టుల భర్తీ

హైదరాబాద్: 'అది ఉమ్మడి కరీంనగర్‌లోని ప్రధాన దేవాలయం. నిత్యం వేల మంది భక్తులు వస్తుంటారు. ఐదారు నెలల క్రితం ఆ ఆలయంలో పరిచారకుల (సహాయ అర్చకులు) నియామకాలు జరిగినప్పుడు, అప్పటికే ఆ దేవాలయంలో అర్చకులుగా పనిచేస్తున్న వారి కుమారులు నియమితులయ్యారు. ఇతర అభ్యర్థులకు అవకాశం దక్కలేదు. ఇప్పుడు అదే ఆలయంలో నాలుగు అర్చకుల పోస్టుల భర్తీ ప్రక్రియ జరగబోతోంది. అర్చకుల పిల్లలు నలుగురు దరఖాస్తు చేశారు. వారికే పోస్టులు దక్కేలా తెరవెనక రంగం సిద్ధమైందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.' అర్చకుల పోస్టులను బేరానికి అంగట్లో పెట్టేశారు. అర్చకులు, సహాయ అర్చకుల (పరిచారక) పోస్టులకు కొందరు అధికారులు ధర ఖరారు చేసి అమ్మకానికి తెరదీశారు. కొన్ని ఆలయాల్లో పద్ధతిగానే సాగుతున్నా, కొన్నింట్లో అక్రమాలకు గేట్లు ఎత్తారు.

**పే స్కేల్ పోస్టులు కావటంతో...**

గతంలో ఆలయాల్లో అర్చకులు, పరిచారకులు, డోలు సన్నాయి వాయించే వారి పోస్టులంటే పెద్ద ప్రాధాన్యం ఉండేది కాదు. వారికి జీతాలను ఆ దేవాలయ ఆదాయం నుంచే అత్తెసరుగా చెల్లించేవారు. కానీ, ఇప్పుడు దేవాదాయ శాఖ అధీనంలోని ఆలయాల్లో పనిచేసేవారికి ప్రభుత్వ పేస్కేల్ ప్రకారం జీతాలు అందుతున్నాయి. దీంతో ఆయా పోస్టులకు మంచి డిమాండ్ నెలకొంది. రాష్ట్రంలోని 55 ప్రధాన ఆలయాల్లో పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలైంది. అయితే, భర్తీ ప్రక్రియ టీజీపీఎస్సీ లాంటి నియామక సంస్థల ద్వారా కాకుండా, ఆలయాల స్థాయిలోనే జరిగేలా ఏర్పాటు చేశారు. నియామక నోటిఫికేషన్లను కూడా దేవాదాయ శాఖ కమిషనరేట్ ద్వారా కాకుండా ఆయా దేవాలయాల స్థాయిలోనే జారీ అయ్యాయి. అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. దేవాలయ ఈఓలకు అభ్యర్థులు నేరుగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఆ దరఖాస్తుల ప్రక్రియ యావత్తు లోపభూయిష్టంగా సాగింది. చాలాచోట్ల అభ్యర్థులకు రశీదు కూడా ఇవ్వలేదు.



# సన్‌డే

ఎండల ప్రభావంతో వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు భరించరాని వేడి ఉండడంతో ఆ తర్వాతనే ప్రజలు రోడ్లపైకి వస్తున్నారని, ఉదయం 9 గంటలకు దుకాణాలను తెరిస్తే రాత్రి 2, 3 గంటలు మాత్రమే వ్యాపారాలు సాగుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. మిగతా సమయంలో గిరాకీలు ఉండడం లేదని అంటున్నారు. కొందరు మధ్యాహ్న వేళల్లో దుకాణాలు మూసివేసి సాయంత్రం ఓపెన్ చేస్తున్నారు. దినసరికూలీలు, కార్మికులు, హమాలీలు, ఆటోడ్రైవర్లు పనులు దొరకడం లేదని, పూటగడవడమే కష్టంగా మారుతోందని వాపోతున్నారు. పక్షులు, జంతువులు, మూగజీవాలువిలవిలలాడుతున్నాయి. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఉపశమనం కోసం బయటకు వచ్చే వారు కొబ్బరి నీళ్లు, చెరకు రసాలు, పండ్ల రసాలు, మజ్జిగ, లస్సీ, కూల్ డ్రింక్స్ వంటి శీతలపానీయాలను తీసుకుంటున్నారు. ఎండల తీవ్రతను తట్టుకునేందుకు తలకు హెల్మెట్లు, టవల్స్, టోపీలు ధరించడం, మహిళలు, బాలికలు చున్నీలు చుట్టుకుంటున్నారు. ప్రతియేడాది మే చివరివారంలో వచ్చే నైరుతి రుతుపవనాలు ఈసారి మరింత ఆలస్యమవుతాయని, ఎండల తీవ్రత కూడా అధికంగానే ఉంటుందని, మరో నెలరోజులపాటు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ వేత్తలు, డాక్టర్లు సూచిస్తున్నారు.

# నిమ్స్ ఉద్యోగులపై పర్యవేక్షణేది!

ఖైరతాబాద్: నిమ్స్ వైద్యశాలలో వెలుగుచూసిన కిడ్నీ దందా వ్యవహారం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నది. డయాలసిస్ రోగులను లక్ష్యంగా చేసుకొని కిడ్నీ ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసిన ఘటనలో ఓ వార్డు బాయ్ మాత్రమే కాకుండా మరికొందరి ప్రమేయమూ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ వ్యవహారం కొనసాగుతున్నదన్న ఆరోపణలున్నాయి. 2023 నవంబర్‌లో నిందితుడు నాగరాజు పరిచయమైనట్లు బాధితులు చెబుతుండగా, రెండు సంవత్సరాలకు పైగానే ఈ వ్యవహారం కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది. డయాలసిస్ రోగులతో వార్డులోనే సంప్రదింపులు జరుపుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నా.. విషయం యాజమాన్యం దృష్టికి వెళ్లకపోవడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్ట్ ఉద్యోగుల విధులను పర్యవేక్షించే బాధ్యత సూపర్‌వైజర్లపై ఉంటుంది. వార్డు బాయ్‌ల పనితీరును ఎప్పటికప్పుడు గమనించాలి. ఈ వ్యవహారం ఇంత కాలం బయటపడక పోవడంపై ఆస్పత్రి ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు. ఈ విభాగంలోని ఉద్యగులందరినీ పర్యవేక్షించాల్సిన బాధ్యత ఓ డిప్యూటీ స్థాయి వైద్యాధికారిపై ఉంటుంది. కానీ రెండు సంవత్సరాలకు పైగా ఈ వ్యవహారం సాగుతున్నా.. పట్టించుకోకపోవడంపై పలువురు ఉద్యోగులు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

# గౌరవ డాక్టరేట్ పురస్కారం అందుకున్న బొడ్డు శంకర్..




**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి ప్రతినిధి):** చెన్నైలో భారతీయ విద్యా భవన్‌లో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్షిప్ అండ్ ఎక్సలెన్స్ నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో సామాజిక సేవకుడు, తెలంగాణ ఉద్యమకారుడు బొడ్డు శంకర్‌కు ఆదివారం డాక్టర్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ లో గౌరవ డాక్టరేట్ పురస్కారం ప్రదానం చేశారు. వికలాంగులకు అందిస్తున్న సేవలు, తెలంగాణ ఉద్యమంలో పోషించిన కీలక పాత్ర, వివిధ సామాజిక రంగాలలో నాయకత్వం, ప్రజాసేవలో చూపుతున్న అంకితభావాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అమృతవల్లి, ఫౌండర్ డైరెక్టర్ వెంకటేషన్, గౌని నర్సింహ గౌడ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు బొడ్డు శంకర్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బొడ్డు శంకర్ మాట్లాడుతూ, గత 22 సంవత్సరాలుగా వికలాంగులకు సేవలు అందించడం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం, ప్రజల కోసం వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం తనకు గర్వకారణమని తెలిపారు. తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ పురస్కారం అందజేసిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ (ఖూఖ) లీడర్షిప్ అండ్ ఎక్సలెన్స్ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ముగిసిన వేసవి కరాటే శిక్షణ - విజేతలకు బహుమతుల ప్రదానం

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** జిల్లెలగూడ కమలానగర్ కాలనీలోని బి.ఆర్. అంబేద్కర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన వేసవి కాల కరాటే శిక్షణ కార్యక్రమం ఆదివారంతో అత్యంత ఘనంగా ముగిసింది. గ్రాండ్ మాస్టర్ జి. నాగరాజు, మాస్టర్స్ శివ, మంజునాథ్, సంగీత ల ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ వేసవి శిక్షణలో స్థానిక చిన్న పిల్లలు, యువతీ యువకులు అత్యంత ఉత్సాహంతో, భారీ సంఖ్యలో పాల్గొని కరాటే మెళకువలను నేర్చుకున్నారు. శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థుల ప్రతిభను నిరూపించేందుకు ప్రత్యేకంగా కరాటే పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ కార్పొరేటర్ మాదారి సురేఖ ముఖ్య అతిథిగా విచ్చేసి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో పిల్లల కోసం ఇలాంటి అద్భుతమైన కరాటే శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు గ్రాండ్ మాస్టర్ మరియు మాస్టర్స్ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతిరోజూ ఉదయాన్నే ఎంతో శ్రద్ధతో వచ్చి కరాటే నేర్చుకున్న విద్యార్థుల క్రమశిక్షణను ఆమె అభినందించారు. అందరూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మరిన్ని బహుమతులు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ ముగింపు వేడుకలో కరాటే మాస్టర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# రజకులను ఎస్సీలుగా గుర్తించి సామాజిక న్యాయం చేయాలని కోరిన గోపి రజక

- సమావేశంలో నేటికీ కుల వివక్షత ఎదుర్కొంటుంది రజకులేనా
- ప్రభుత్వం విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలన్న పేపర్ నర్సిములు
- ఫించన్, రెండు లక్షల రుణాలు మంజూరు చేయాలన్న బిజ్జారం నర్సిములు

**గద్వాల్, మే 17(క్రైమ్ మిర్రర్):** సేవా కులంగా తరతరాలుగా ఎట్టి చాకిరి చేస్తున్న కులం రజకులని అంటు ముట్టు బట్టలు ఉత్కంట ,పుట్టుక నుంచి చావు వరకు శుభ అశుభ కార్యాలు చేసే ఏకైక కులం రజకులు మాత్రమే దేశంలో 18 రాష్ట్రాల్లో ఎస్సీ లుగా మిగతా 11 రాష్ట్రాల్లో ఓబిసీ లుగా ఉండటం ఆర్థిక అసమానతలు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేసిన గోపి రజక. గద్వాల్ జిల్లా కేంద్రంలోని రజక సంఘం భవనంలో ఆదివారం జిల్లా నాయకులు పేపర్ నర్సిములు , గద్వాల్ పట్టణ అధ్యక్షులు సి.నర్సిములు,అధ్యక్షతన ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశానికి తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక , వనపర్తి జిల్లా అధ్యక్షులు ఇటిక్యాల బండలయ్య, కౌన్సిలర్ సి.రామకృష్ణ,ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ నేటికీ గ్రామాల్లో వివక్షతకు గురైతున్నారు కుల బహిష్కరణలు కులం పేరుతో దూషణలు,రజక స్త్రీలను అవమానించడం, దాడులు, హత్యలు అత్యాచారాలు నేటికి కొనసాగుతున్నాయని వారన్నారు. కాబట్టి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎస్సీ జాబితాలో చేర్చుతామని చెప్పిన మాట సాకారం చేసుకోవాలని కోరారు.

**ప్రభుత్వం ఉచిత విద్యుత్ బకాయిలు చెల్లించాలి**

ఉచిత విద్యుత్ బిల్లులు ప్రభుత్వం చెల్లించక 2 సం.లు కావస్తుందని వెయ్యిలలో బిల్లులు రావడంతో వృత్తిదారులు



అయోమయంలో పడ్డారని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు కాబట్టి తక్షణమే బకాయిలు చెల్లించాలని జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు.

**ఫించన్, 2 లక్షల ఋణాలు మంజూరు చేయాలి**

45 సం.లు నిండిన వృత్తిదారుడికి ఫించన్ సదుపాయం కల్పించాలని గత ప్రభుత్వాన్ని అనేక పర్యాయాలు కోరడం జరిగింది కనీసం ప్రజా సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వమైనా 5000 రూ. ఫించన్ ఇవ్వాలని పేపర్ నర్సిములు కోరారు. షరతులు లేని ఋణాలు బ్యాంకుల ద్వారా 2 లక్షల రూపాయలు వృత్తిదారుడికి అందజేసి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశానికి హాజరైన నాయకులు ముఖ్యనాయకుల సమావేశానికి బిజేపి పట్టణ ఉపాధ్యక్షులు సి.నర్సిములు, జిల్లా కార్యదర్శి సి.విజయ్ కుమార్,జిల్లా నాయకులు గుత్త నాగరాజు , గద్వాల్ పట్టణ ఉపాధ్యక్షులు కోట్ల వీరేశ్ ,ఇటిక్యాల మండల అధ్యక్షులు సి. మద్దిలేటి,ఉద్దండపూర్ సి.కృష్ణ ,వీరపురం మాజీ అధ్యక్షులు సి.నారాయణ , సికె అరవింద్ తదితరులు పాల్గొన్నారు

# చౌటుప్పల్ పరిధిలో భారీగా గంజాయి స్వాధీనం

- 437.5 కిలోల గంజాయి పట్టివేత
- పరారీలో ఇద్దరు,ఇద్దరు నిందితులు అదుపులోకి...
- పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు...
- వివరాలు వెల్లడించిన సీఐ జి.మన్మధకుమార్

**చౌటుప్పల్,మే 17, క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం ,పంతంగి టోల్ ప్లాజా వద్ద ఈనెల 16వ తేదీ శనివారం ఈగల్ ఫోర్స్, రాచకొండ నార్కోటిక్స్, చౌటుప్పల్ పోలీసులు సంయుక్తంగా కలిసి భారీగా గంజాయిని పట్టుకున్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ జీ మన్మధకుమార్ వెల్లడించిన వివరాలు ప్రకారం... శనివారం పోలీసులకు నమ్మదగిన విశ్వసనీయ సమాచారం మేరకు రాచకొండ నార్కోటిక్స్,ఈగల్ పోర్స్ పోలీసులు,చౌటుప్పల్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో పంతంగి టోల్ ప్లాజా నైల్ కంపెనీ ఎదురుగా హైదరాబాదు వైపుకు జాతీయ రహదారి వద్ద తనిఖీలు నిర్వహించగా టీఎస్ 07జి.ఎం 4617 నకిలీ నంబర్ ప్లేట్ గల మహీంద్రా ఎక్స్.యు.వి వాహనాన్ని అనుమానస్పదంగా వాహనాన్ని ఆపి తనిఖీ చేసే సమయంలో అందులో ఉన్న నలుగురు వ్యక్తుల్లో ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి అక్కడి నుండి పారిపోగా, మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో సుమారు 437.5 కిలోల గంజాయిని గుర్తించి నిందితులు ఉపయోగించిన వాహనంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇందులో 5 కిలోల చొప్పున 83 ప్యాకెట్లు, 2 కిలోల చొప్పున 8 ప్యాకెట్లను గుర్తించినట్లు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు 2 కోట్ల 18 లక్షల 75 వేల రూపాయలు ఉంటుందని వెల్లడించారు. పోలీసుల విచారణలో నిందితులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారని, రాజమండ్రి ప్రాంతంలో రాకేష్ అనే వ్యక్తి వద్ద నుండి గంజాయిని సేకరించి ఉత్తరప్రదేశ్‌కు నిందితులు తరలిస్తున్నట్లు వెల్లడించారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి నుండి గంజాయిని కొనుగోలు చేసి ఉత్తరప్రదేశ్ కు రవాణా చేస్తున్నట్లు నేరని అంగీకరించినట్లు తెలిపారు. ఈ గంజాయి సరఫరా వెనుక రాజమండ్రికి చెందిన రాకేష్ అనే ప్రధాన వ్యక్తి ఉన్నట్లు నిందితులు వెల్లడించిన్నట్లు సిఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితుల వివరాలను వెల్లడించారు. సలీమ్ (34),లిషాడి గ్రామం, మీరట్ జిల్లా,ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. అమన్ (22 )లిషాడి గ్రామం, మీరట్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు.ఈ కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమీరుద్దీన్, ఫిరోజ్ లను ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టుబడిన నిందితులు ఇద్దరినీ రిమాండ్ కు తరలించినట్లు సిఐ జి.మన్మధ కుమార్ తెలిపారు. మత్తు పదార్థాల రవాణాపై ఉక్కు పాదం మోపుతున్నామని సిఐ జి.మన్మధకుమార్ హెచ్చరించారు. వ్యూహాత్మకంగా భారీగా గంజాయిని పట్టుకున్న సిఐ జి. మన్మధ కుమార్, ఈగల్ ఫోర్స్ సీఐ ప్రవీణ్ కుమార్, చౌటుప్పల్ ఎస్సై కే యాదగిరి, ఎస్ఐ డి నర్సిరెడ్డి, ఈగల్ పోర్స్ ఎస్సై బి .జివన్ రెడ్డి, చౌటుప్పల్ పోలీస్ సిబ్బంది జి మహేష్, టి అశోక్, వి ఉపేందర్, ఈగల్ ఫోర్స్ సిబ్బంది పి ఏడుకొండలు, ఎల్ జానకి రామ్, సంతోష్ లను డి.ఎస్.పి మధుసూదన్ రెడ్డి,పోలీస్ ఉన్నత అధికారులు అభినందించారు.



## బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి

- తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి



**గండిపేట(క్రైం మిర్రర్):** బీఆర్ఎస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి పదవులు అప్పగించి వారిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిలు అన్నారు. శంషాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కోలన్ ప్రదీప్‌రెడ్డి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శిగా గాజుల రాహుల్, జనార్ధన్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్‌గా కుమ్మరి అర్జున్, మహేష్‌యాదవ్, వెంకటేష్ ముదిరాజ్, జాన్, సెక్రటరీగా వేణుగౌడ్, పరమేష్‌యాదవ్, బాలరాజుగౌడ్‌లు నియమితులైయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు వారిని కలిసి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డిలు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి అందరికి కలిసి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి : తెలంగాణ బిజెపి చీఫ్ రామచందర్ రావు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లెలగూడ డివిజన్ శక్తి నగర్‌లో బ్లడ్ డోనర్ లైఫ్ సేవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు హాజరై మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు తో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ రక్తదానం అనేది మానవాళికి మనం చేయగల అత్యున్నత సేవ అని మనం చేసే రక్తదానం తీవ్రమైన అనారోగ్య పరిస్థితులతో పోరాడుతున్న వారికి, మరీ ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు కొత్త ఆశను, బలాన్ని మరియు ప్రాణదానాన్ని ప్రసాదిస్తుందని తెలిపారు. నేటితరం యువత పెద్ద ఎత్తున రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.



## నేడు, రేపు రామన్నపేటలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి

- జిల్లా ప్రధాన కార్యదర్శి
- కొండమడుగు నర్సింహ్మా




**భువనగిరి, మే 17(క్రైమ్ మిర్రర్):** మే 18,19 తేదీలలో రామన్నపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. గత జిల్లా రెండవ మహాసభలు మోత్కూరు పట్టణంలో పట్టణంలో 2022 నవంబర్ 26,27 తేదీలలో నిర్వహించామని తెలిపారు. గత మూడున్నర సంవత్సరాలుగా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించామని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పేదలు సాగు చేసుకుంటున్నా ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్ బుక్కులు ఇవ్వాలని, జిల్లాల కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధం ఎత్తివేయాలని ఉద్యమాలు చేపట్టామని అన్నారు. చౌటుప్పల్ మండలంలో మల్కాపురం, తూప్రాన్ పేట, సింగరాయ చెరువు, చిన్న కొండూరు నారాయణపురం మండలంలోని రాచకొండ ప్రాంత భూములకు సంబంధించిన రైతుల సమస్యలపై, పోచంపల్లి మండలంలోని జలాల్ పూర్, మెహన్ నగర్ గ్రామాలలోని భూములు, భువనగిరి మండలంలోని హమ్మాపురం, మోటకొండూరు మండలంలోని వర్టూరు, గుండాల మండలం కేంద్రంలోని భూములను పేదలు సాగు చేసుకుంటున్న వాటికి పట్టాలు ఇవ్వాలని పోరాటాలు నిర్వహించి మాటూరు గ్రామంలో పేదలకు పట్టాలు కూడా ఇప్పించామని తెలిపారు. జిల్లాలో చౌటుప్పల్, బీబీనగర్, పోచంపల్లి, భువనగిరి, బొమ్మలరామారం మండలాల్లో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధాన్ని ఎత్తివేయాలని ఉద్యమాలు కొనసాగించినామని తెలిపారు. మరోపక్క బస్వాపురం రిజర్వాయర్ లో భూములు కోల్పోయిన రైతులు, ఇల్లు కొల్పోపోతున్న పేదలకు, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఆ భూముల మీద ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ కూలీల కూడా నష్టపరిహారం ఇవ్వాలని పోరాటాలు నిర్వహించామని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులు తెచ్చి కూలీలకు రెండు పూటల తిండి పెడుతున్న ఉపాధి హామీ పథకాన్ని మోడీ ప్రభుత్వం జిరాంజీ చట్టం తెచ్చి ఎత్తివేయాలని కుట్రలు చేస్తుందని ఆ కుట్రలకు వ్యతిరేకంగా మూడు సంవత్సరాల కాలంలో అనేక ఉద్యమాలు చేపట్టామని తెలిపారు. వ్యవసాయ కూలీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని, విద్యా, వైద్యం, ఉపాధి ప్రభుత్వం బాధ్యత తీసుకొని కల్పించాలని, పాలకులు ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దళిత, గిరిజన వాడలు, కూలీ పేటలు అభివృద్ధి చేయాలని అనేక కార్యక్రమాలు పోరాటాలు నిర్వహించామని ఈ మూడున్నర సంవత్సరాలలో నిర్వహించిన పోరాటాలను, ఉద్యమాలను సమీక్షించుకోవడానికి, పోరాటాలు రూపొందించుకోవడానికి ఈ రెండు రోజులపాటు రామన్నపేటలో నిర్వహిస్తున్న మహాసభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు. రేపు 18 తేదీ సాయంత్రం 5 గంటలకు రామన్నపేట మండల కేంద్రంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి, వెంకట్, మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు యండి జహంగీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి, జిల్లా నాయకత్వం పాల్గొని ప్రసంగిస్తారని, 19వ తేదీన నిర్వహించే ప్రతినిధుల మహాసభకు జిల్లా నలుమూలల నుండి 250 మంది ప్రతినిధులు పాల్గొంటారని ఈ మహాసభకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని వివిధ ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు కూడా మహాసభలలో పాల్గొని తమ సందేశాలను ఇవ్వనున్నారని నర్సింహ తెలిపారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట గడ్డ, అనేక కూలీ, భూమి ఉద్యమాలు నిర్వహించిన ప్రాంతము, కవులు, కళాకారులకు జానపద కళారూపాలకు కేంద్రమైన రామన్నపేటలో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలో ప్రతినిధులు, ఈ సందర్భంగా నిర్వహిస్తున్న బహిరంగలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ కోరారు.

## సి.టీ స్కాన్ ను రోగులకు అందుబాటులోకి తీసుకురావాలి

- బి ఆర్ ఎస్ వనస్థలిపురం అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్త

**ఎల్బీనగర్ మే 17, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సి.టీ స్కాన్ పరికరాలను రోగులకు అందుబాటులో కి తీసుకురావాలి అని సూపరిండెంట్ నాగేందర్ కు వినతిపత్రం సమర్పించిన వనస్థలిపురం డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్త. గత 6 నెలల క్రితం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సహకారంతో, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సహకారంతో వనస్థలిపురం ఏరియా హాస్పిటల్లు సి.టి స్కాన్ పరికరాన్ని కేటాయించారు అని రవికుమార్ అన్నారు. సి.టీ స్కాన్ పరికరా న్ని కేటాయించి ఇన్ని రోజులు కావస్తునా ప్రజలకు అందుబాటులోకి తీసుకు రాకపోవడం వలన స్కానింగ్ అవసరం ఉన్న రోగులు ప్రైవేట్ గా చేయించుకోవడం వల్ల అధిక డబ్బులు ఖర్చు అవుతున్నాయి అని, సామాన్యులకు చాలా ఇబ్బంది కలుగు తుంది అని వనస్థలిపురంకు చెందిన ప్రజలు చింతల రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే ఆయన సూపరిండెంట్ ను కలిసి వినతిపత్రం సమర్పించగా సూపరిండెంట్ నాగేందర్ త్వరలో ప్రజలకు సి.టీ స్కాన్ ను అందుబాటులోకి తెస్తామని సానుకూలంగా స్పందించారు అని రవికుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం బిఆర్ఎస్ నాయకులు కొలిశెట్టి సంజయ్ కుమార్, ఫేస్-4 కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీధర్ రావు, పార్టీ వర్కింగ్ అధ్యక్షులు లగ్గాని శ్రీధర్ గౌడ్, ఉపాధ్యక్షులు మహేందర్ రాజు, పార్టీ బస్తి, వాడ అధ్యక్షులు కిషోర్ కుమార్, పరమేశ్వర్ గౌడ్, విజయ్, కిషోర్, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.



# నీటి సరఫరాలో వివక్ష ఎందుకు..? కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సూటి ప్రశ్న

- నీటి సరఫరాపై కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ నేత నవీన్ కుమార్ విమర్శలు
- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మన్నే నవీన్ కుమార్ సవాల్ చేస్తూ బండ్లగూడ జాగిర్ లో ఏ కాలనీ కైనా వెళ్దాం రండి
- పన్నుల్లో సమభావం... నీటి సరఫరాలో వివక్షా?
- నీళ్ల ట్యాంకర్లు వద్దు ఇంటి నల్ల కలెక్షనే ముద్దు
- బస్తీ పర్యటనలో కాంగ్రెస్ నాయకులకు అన్ని కాలనీలకు గ్రామ కాలనీలకు తేడా ఎందుకు
- మంచినీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలను మభ్య పెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓల్డ్ విలేజీలు, కాలనీలు అంటూ ప్రజల మధ్య విభజన తెచ్చి, తాగునీటి సరఫరాలో వివక్ష చూపడం అన్యాయమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నవీన్ కుమార్ మండిపడ్డారు. పన్నులు అందరూ కడుతుంటే, ఓట్లు అందరూ వేస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు ఎందుకు తేడా చూపుతున్నారని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై పూర్తి అవగాహనతో తాము నిర్వహించిన "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమానికి మహిళలు, కాలనీవాసుల నుంచి భారీ మద్దతు లభించిందని ఆయన పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్‌లో సుమారు 40 వేలకు పైగా ఇళ్లు ఉన్నాయని, ప్రతిరోజూ లేదా రోజు విడిచి రోజు (డే బై డే) నీటి సరఫరా చేయాలని నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం మూడు, నాలుగు రోజులకోసారి మాత్రమే నీరు వస్తుండటంతో మహిళలు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 250కి పైగా కాలనీలకు తాగునీరు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పాత వాటర్ బెల్స్‌ను తొలగించి, అవసరమైన చోట్ల 6 అంగుళాలు, 4 అంగుళాల కొత్త పైప్‌లైన్లు వేయాలని, నీటి



ఒత్తిడి పెంచేందుకు బూస్టర్ మోటార్లు ఏర్పాటు చేయాలని కోరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి చేపట్టిన తాగునీటి పోరాటానికి వస్తున్న ప్రజాదరణ చూసి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు భయపడిపోయి ప్రెస్ మీట్ లు పెట్టి పేపర్ విడుదల చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ పరిధిలోని 121, 122, 123 డివిజన్లలో నీటి సమస్యే లేదని అబద్ధాలు చెప్తున్న నాయకులకు తాము సవాల్ విసురుతున్నామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ ద్వారా రాష్ట్రంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా పాలకులు గ్రామాలు కాలనీలు అన్న తేడా లేకుండా, ప్రజలందరికీ సమానంగా తాగునీటిని సరఫరా చేయాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు...

# లేబర్ కార్డుతో ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- తెలంగాణ ఆల్ బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నగళ్ల రామచంద్రయ్య

**గండిపేట(క్రైం మిర్రర్):** లేబర్ కార్డుతో కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆల్ బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నగల రాంచంద్రయ్య తెలిపారు. ఆదివారం రాజేంద్రనగర్ జోన్ లోని శివరాంపల్లి లో యూనియన్ ఆధ్వర్యంలో వర్కర్స్ కి రక్షణ పరమైన చర్యలపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మికులు పనిచేస్తున్న క్రమంలో ముందస్తుగా రక్షణ చర్యలు లేకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి అమావాస్య రోజు కార్మికులు ఎలాంటి పనులకు వెళ్ళరాదని, సెలవుదినంగా పాటించాలని సూచించారు. కార్మికుల సంక్షేమం కోసం ఈ యూనియన్ అవిరాళంగా కృషి చేస్తుందన్నారు. కార్మికులకు ఎవరికైనా ఆపద వచ్చినా, ప్రమాదం జరిగిన వారికి యూనియన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కొందరు యాజమాన్యాలు పనికి ముందు ఒక రేటు, పని ముగిశాక మరో రేటు కూలి ఇవ్వడం తో మోసం చేస్తున్నారని ఇలాంటి ఘటనలు జరగకుండా కార్మికులకు న్యాయం చేసేందుకు యూనియన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్మికులకు పని చేసే క్రమంలో రక్షణ పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు చట్ట ప్రకారం కార్మికులకు పని వేతనాలను అందించాల్సిన అవసరం



ఉందన్నారు. రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్ల ఎంతోమంది కార్మికులు భవన నిర్మాణంలో పని చేస్తున్న క్రమంలో ప్రమాదాలకు గురవడమే కాకుండా ప్రాణాలను సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడు యూనియన్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. మున్ముందు కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ కార్మిక చట్ట ప్రకారం వచ్చే సదుపాయాలు, సౌకర్యాలు, హక్కుల సాధన కోసం యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి ఎన్ యాదగిరి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి రవీందర్ రెడ్డి, యూనియన్ నాయకులు జంగయ్య యాదవ్, యాదయ్య, జంగయ్య, ఎన్ రాజ్ కుమార్, పి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మీర్పేట్ లోని కమల నెహ్రూ నగర్ కాలనీలో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి దేవత పున ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా జరిగిన అమ్మవారి శాంతి కళ్యాణం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్, ధనలక్ష్మి రాజకుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అబ్బనమోని గోపి యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మ కంటి దయానంద్ ముదిరాజ్, కుమార్ ముదిరాజ్, సాయం వెంకటేష్ ముదిరాజ్, పులకరం శివశంకర్ ముదిరాజ్, ఐతరాజు వెంకట్, మేకల కృష్ణ ముదిరాజ్, రామకృష్ణ ముదిరాజ్, , దిండు మహేందర్, ముక్కాముల లక్ష్మణ్ యిదవ్, బక్కతట్ల కృష్ణ యాదవ్, వనం నరసింహ్మా తదితరులు పాల్గొన్నారు – **(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)**

# అవగాహనఆరోగ్యంమహిళా శక్తి కోసం ఫైబ్రాయిడ్ రెడ్ స్ట్రెంత్ వాక్



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజ్ బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ మహిళా ట్రైనీ అధికారులు, అకాడమి సిబ్బంది కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రహేజా మైండ్ స్పేస్ సమీపంలోని హోటల్ వెస్టిన్ వద్ద నిర్వహించిన ఫైబ్రాయిడ్ రెడ్ స్ట్రెంత్ వాక్ కార్యక్రమంలో ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని అపోలో హాస్పిటల్స్ మహిళల ఆరోగ్యంపై చైతన్యం కల్పించే లక్ష్యంతో నిర్వహించారు. ముఖ్యంగా అధిక రుతుస్రావం, గర్భాశయ ఫైబ్రాయిడ్స్, రక్తహీనత వంటి సమస్యలపై మహిళల్లో అవగాహన పెంపొందించడం, ప్రారంభ దశలోనే నిర్ధారణ, నివారణ చర్యల ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమానికి అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ శోభన కామినేని ఉదయం జెండా ఊపి మూడు కిలోమీటర్లు, ఐదు కిలోమీటర్ల అవగాహన వాక్/రన్‌ను ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్, సంక్షేమం, సామాజిక అవగాహన కార్యక్రమాల పట్ల తెలంగాణ పోలీస్ అకాడామీ నిరంతరం కట్టుబడి ఉందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అమిత్, అకాడమీ నుంచి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ రాంబాబు, మహిళా సిబ్బంది, మహిళా ట్రైనీ అ్యధికారులు తదితరలు పాల్గొన్నారు.

# కార్తీక్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

- రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగీరు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగీరు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజ్ అన్నారు. కాలనీల్లో ప్రజలు తీవ్ర నీటి సమస్యలతో ఇబ్బందులు పడుతుందటే ప్రజల బాధను గుర్తించి కార్తీక్‌రెడ్డి వాక్ ఫర్ వటర్ అనే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న అపార స్పందనను చూసి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక అనవసర విమర్శలు చేస్తున్నారన్నారు. వాక్ ఫర్ వాటర్ కార్యక్రమం ఒక్క రోజు ముందు ఎమ్మెల్యే అధికారులతో సమావేశం పెట్టడం హాస్యాస్పందం అన్నారు. నిజంగా ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ఇంతకుముందే చర్యలు తీసుకోని ఉండాలన్నారు. ప్రజల నీటి కోసం రోడ్డెక్కిన తర్వాత స్పందించడం కేవలం రాజకీయ డ్రామా మాత్రమేనన్నారు. కార్తీక్‌రెడ్డిని, స్వామిగౌడ్‌ను వ్యక్తిగతంలో విమర్శించడం కాంగ్రెస్ నాయకులు వెంటనే మానుకోవాలన్నారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న నాయకులను అడ్డుకోవాలని చూస్తే రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం చెబుతారన్నారు. ప్రజల కోసం నడిచే నాయకులను ప్రజలే గెలిపిస్తారన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని వారిని ప్రజలే తిరస్కరిస్తారన్నారు.



## రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** రానున్న వర్షాకాలంలో డ్రైనేజీలు నిండుకోకుండా పూడికతీత పనులను ముమ్మరం చేయిస్తున్నామని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. ఆదివారం హైదర్‌గూడలో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌లలో నిండి ఉన్న వ్యర్థాలను సిల్టును తీసివేయాలని లేకుంటే వర్షాకాలంలో వర్షాలు పడి మ్యాన్‌హోల్స్ నిండి డ్రైనేజీ నీళ్లన్నీ రోడ్లమీద ప్రవహిస్తాయని అధికారులకు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడి వారి సిబ్బందిని పిలిపించి వారితో ఏయిర్‌టెక్ మెషిన్, బకెట్‌లతో వ్యర్థాలను మ్యాన్‌హోల్‌లలో నిండి ఉన్న ఇసుకను తొలగింపజేయించామన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రటరీ సాబాద విజయ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కాకులారం కృష్ణ, కిట్టు, మల్గారి బాలకృష్ణారెడ్డి, మల్గారి కొండల్‌రెడ్డి, చెట్టిగారి సతీష్, సిబ్బంది నర్సింగ్, హరికృష్ణ తదితరులున్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**చౌటుప్పల్,మే 17,క్రైమ్ మిర్రర్ :** రాంగ్‌రూట్‌లో వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో పెట్రోల్ బంక్ ఉద్యోగి మృతి చెందిన ఘటన చౌటుప్పల్ మండల పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..చౌటుప్పల్ కు చెందిన అన్నెబోయిన మల్లేష్ (45) హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. శనివారం రోజు మాదిరిగానే డ్యూటీ ముగించుకొని తన సీబీజెడ్ బైక్ ఏపీ13 ఎం 4987 పై తూప్రాన్‌పేట్ నుంచి చౌటుప్పల్‌లోని ఇంటికి బయలుదేరాడు.మార్గమధ్యలో ఖైతాపురం స్టేజి సమీపంలోని ఎన్హెచ్-65 హైవేపై ఉదయం సుమారు 10:45 గంటల సమయంలో రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేష్ రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం చింతలకుంటలోని నాసా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 17వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 1:47 గంటలకు మల్లేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడి భార్య అన్నెబోయిన అలివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ జి. మన్మధకుమార్ తెలిపారు.

# వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలి

- ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి...
- వాహనదారులు తప్పనిసరి లైసెన్స్ కలిగి ఉండాలి...
- ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరి పాటించాలి...
- చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ ఎం. విజయ మోహన్



**చౌటుప్పల్,మే17,క్రైమ్ మిర్రర్:** వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ ఎం విజయ మోహన్ తెలిపారు. ఆదివారం చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ సిఐ విజయమోహన్ రోడ్డు భద్రతా నియమాలపై యువతకు, వాహనదారులకు అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులు ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు తప్పనిసరి హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. అలాగే కారులో ప్రయాణించేటప్పుడు కూడా డ్రైవర్ ప్రయాణికులు తప్పనిసరి సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు చరవాణిలో మాట్లాడుతూ నడపవద్దని సూచించారు. వాహనదారుడు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే భారీ జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. వాహనాలను పరిమితి మించిన వేగంతో నడపకూడదని, జన సమర్థం ఉన్న ప్రదేశాలు, పాఠశాలల వద్ద వేగాన్ని తగ్గించి నడపాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండని మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఇలా చేస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వాహనదారులు ముందున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయకూడదని తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెనక కూర్చున్న కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరి లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మణికొండలో మెగా హెల్త్ క్యాంప్



**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా స్వచ్ఛంద సంస్థ నవసేవా సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో టిక్స్ హాస్పిటల్ వైద్య బృందం పర్యవేక్షణలో ఆదివారం ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణికొండ మున్సిపల్ కౌన్సిల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ హాజరై ప్రారంభించారు. ఉచిత వైద్య శిబిరంలో టిఎక్స్ హాస్పిటల్ వైద్య బృందం కొండపల్లి రంగారావు, దంత వైద్య నిపుణులు డాక్టర్ కొండపల్లి చైతన్య నేతృత్వంలో జిఆర్‌బిఎస్, బీపీ, షుగర్, బిఎంఐ, బిఎండి, ఈసిజి పరీక్షలతో పాటు నేత్ర, దంత, చర్మ, జుట్టుకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. . ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్, శ్రీరాములు, ఎంప్లాయిస్ కాలనీ, హుడా కాలనీ, చైనత్య కాలనీ వాసులు ఈ ఉచిత మెగా వైద్య సేవల్ని వినియోగించుకున్నారు. నవసేవా సంకల్ప ట్రస్ట్ చైర్మన్ మణి, ప్రధాన కార్యదర్శి మహేష్, అధ్యక్షుడు మొహమ్మద్ అజార్, ఎంప్లాయిస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిశ, కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు, సర్దార్ పటేల్ పార్క్ వాక్ మేట్స్, షేక్‌పేట్ మిత్ర బృందం సభ్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# శంషాబాద్ రాళ్లగూడలో రోడ్డు సమస్య పరిష్కరించకపోతే బైటాయించి ఆందోళన చేస్తా

- తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి
- శంషాబాద్‌లో మున్సిపల్ అధికారులు ఉన్నా లేనట్టా అని ప్రశ్నించారు.





**గండిపేట(క్రైం మిర్రర్):** రోడ్లు అధ్వానంగా మారుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శంషాబాద్ రాళ్లగూడ రోడ్డు దుస్థితిని తెలుసుకోని ఆమె జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. వెంటనే పనులు మొదలు పెట్టాలని లేదంటే తానే స్వయంగా రోడ్డుపై బైటాయించి ఆందోళన చేస్తానని హెచ్చరించారు. శంషాబాద్‌లో మున్సిపల్ అధికారులు ఉన్నా లేనట్టా... లేన్నట్లా అని ప్రశ్నించారు. అధికారులు సిబ్బంది పర్యవేక్షణ లోపించడంతో జాకీ షో రూమ్ ముందల ఓపెన్ డ్రైనేజీ లైన్ డైరెక్ట్ రోడ్‌మీద వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు, డ్రైనేజీ పనులను నిర్వహించాలన్నారు. బుధవారం వరకు ఈ పనులు పూర్తి కాకపోతే రోడ్డుపై బైటాయించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు....

## మణికొండ గార్డెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ గార్డెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసచారి, ఉపాధ్యక్షులుగా ఏ.జగదీష్, చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా వెంకటరత్న, ప్రసాద్, గాది రాజు, జాయింట్ సెక్రటరీగా సంతోష్, కోశాధికారిగా కె.చక్రవర్తిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసచారి మాట్లాడుతూ అందరిని కలుపుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు సమస్యలు లేకుండా చూసుకుంటామన్నారు. కార్యవర్గడ సభ్యులు సమిష్టిగా అందరికి అందుబాటులో ఉంటూ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# పెట్రోల్,డీజిల్,ధరల పెంపుపై సిపిఎం నిరసన

- ప్రజలపై పెను భారం మోపుతున్న మోడీ సర్కార్
- సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా,గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్



**చౌటుప్పల్,మే 17, క్రైమ్ మిర్రర్ :** దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో దేశ ప్రజల పెనుబారం మోపుతున్న మోడీ సర్కార్ అని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని బస్టాండ్ ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి పాషా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే డీజిల్, పెట్రోల్, ధరలను పెంచి ప్రజల ను మరోసారి మోసం చేసిందని అన్నారు. డీజిల్, పెట్రోల్, ధరల పెరుగుదల వల్ల అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని అన్నారు. నిత్యవసర ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అని విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం అని పదే పదే ప్రకటించినది అని గుర్తు చేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు దాటగానే ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం ఎన్నికల కోసం మోడీ అబద్దాలు చెబుతున్నారని ప్రజలు భావిస్తున్నారని, ఇది విశ్వాస ఘాతకం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్, నాయకులు ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, కొండే శ్రీశైలం, బోయ యాదయ్య, తూర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, భావనలపల్లి స్వామి, యాట బాలరాజు, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి రహీం, మానే శాలయ్య, భీమగాని బాలరాజు, యాట ముత్యాలు, వల్లూరి నరసింహ పాల్గొన్నారు.

# పద్మజ్యోతి యువజన సంఘం అధ్యక్షునిగా బడుగు కైలాసం



**చౌటుప్పల్,మే 17, క్రైమ్ మిర్రర్:** కొయ్యలగూడెం పద్మజ్యోతి యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం సంఘం సర్వసభ్యులు ఎన్నుకొన్నారు. సంఘం అధ్యక్షునిగా బడుగు కైలాసం, రచ్చ వెంకటేశం ఉపాధ్యక్షులు, వర్కాల రాజు కార్యదర్శి, వనం సురేందర్ కోశాధికారి, పొట్టబత్తిని ఆనంద్ క్రీడల కార్యదర్శి, జెల్ల ఆనంద్ సాంస్కృతిక కార్యదర్శి, కుడికాల శ్రీనివాస్ గ్రంథాలయ కార్యదర్శి,కార్యవర్గ సభ్యులుగా భీమనపల్లి శేఖర్, కైరంకొండ పాండు, బోనగిరి శ్రీనాథ్, గడ్డం గిరీష్, వడ్డేపల్లి సతీష్, సూరెపల్లి సంతోష్ ఎన్నుకొన్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు బడుగు కైలాసం మాట్లాడుతూ.. తన నియమకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కైరంకొండ స్వప్న అశోక్, గడ్డం నర్సింహ, మాచర్ల కృష్ణ, మరియు సంగ సభ్యులు తదిదరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీ వేయడం హర్షనీయం

- టీజేఎస్ చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జీ ఆర్కే నాగని, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమ్మరి రమేష్



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి జీవో 679 ద్వారా కమిటీ వేసిన సందర్భంగా టీజేఎస్ చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జీ ఆర్కే నాగని, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కుమ్మరి రమేష్‌ల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల మండల కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి అధ్యక్షుడు డాక్టర్ వి.పాండుగౌడ్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కమిటీలో ఉద్యమకారులకు, ముఖ్యంగా ప్రొఫెసర్ కోదండరాంకి స్థానం కల్పించడం సంతోషకరమని పేర్కొన్నారు. పూర్తిగా ఉద్యమకారులతో కూడుకున్న కమిటీ ఆధ్వర్యంలో తప్పకుండా తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కమిటీ కాలయాపన లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి రాజకీయాలకు అతీతంగా నిజమైన తెలంగాణ ఉద్యమకారులందరినీ గుర్తించి గతంలో ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# తెలంగాణ రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి
- బీజేపీ నుంచి భారీగా బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం నర్కూడ గ్రామానికి చెందిన గుడెపు రాజేందర్,తో పాటు గ్రామ బీజేపీ నాయకులు భారీ ఎత్తున వారి సమక్షంలో బీఆర్ఎస్‌పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తు వస్తుందన్నారు. అటూ కేంద్రంలోని బీజేపీ, ఇటూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలతో ప్రజలకు ఒరిగేది ఏమిలేదని అందరికి స్పష్టమైందన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని అందరికి తెలిసిపోయిందన్నారు. అందుకే కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు అధికంగా అవుతున్నాయన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారందరికి ప్రముఖ స్థానం, గుర్తింపు తప్పకుండా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎయిడ్స్ నియంత్రణకు విస్తృత చర్యలు


- మంచిర్యాలలో అంతర్జాతీయ క్యాండిల్‌లైట్ మెమోరియల్ డే

**మంచిర్యాల, మే 17( క్రైమ్ మిర్రర్):** హెచ్ఐవి/ఎయిడ్స్‌తో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్‌లైట్ మెమోరియల్ డే నిర్వహించారు. బాధితుల పట్ల సమాజంలో ఉన్న వివక్షను తొలగించడమే కార్యక్రమ ఉద్దేశమని అధికారులు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.అనిత మాట్లాడుతూ జిల్లాలో 'మొబిలైజేషన్ ఎయిడ్స్ సురక్ష స్ట్రాటజీ'ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. 'టెస్ట్ అండ్ ట్రీట్' విధానం ద్వారా హెచ్ఐవి నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎయిడ్స్, లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ హెచ్ఐవి సెల్ఫ్ టెస్టింగ్, కమ్యూనిటీ బేస్డ్ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.గత ఏడాది జిల్లాలో క్యాండిల్‌లైట్ ర్యాలీలు, ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపెయిన్లు, యూత్ ఫెస్టులు, సీడీపీఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 186 పాఠశాలలు, 44 కళాశాలలు, 186 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించగా, 38 హైరిస్క్ గ్రామాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టినట్లు వెల్లడించారు.జిల్లాలో ప్రస్తుతం 2,052 హెచ్ఐవి కేసులు నమోదై ఉండగా, 952 మంది ఏఆర్టీ సేవలు పొందుతున్నారని తెలిపారు. గత ఏడాదిలో 128 కొత్త కేసులు గుర్తించినట్లు పేర్కొన్నారు. 32,072 మందికి నిర్వహించిన పరీక్షల్లో 126 మందికి, 15,044 గర్భిణీలకు చేసిన పరీక్షల్లో ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు.జిల్లాలో ఒక దిశ కేంద్రం, మూడు ఐసీటీసీలు, ఒక డీఎస్ఆర్‌సీ, ఒక ఎల్ఏసీ ప్లస్ కేంద్రం ద్వారా ఉచిత పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవి సంబంధిత సమాచారం కోసం 1097 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మాస్ మీడియా ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిహెచ్ఓ నామ్ దేవ్, అల్లాడి శ్రీనివాస్, హెల్త్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ శ్రీనివాస్, డిపిఎంఓ రాఘవయ్య ,డిపిఓ ప్రశాంతి, దిశా మేనేజర్ నీలిమ, డిఎండిఓ సంతోష్, ఐ సి టి సి కౌన్సిలర్లు శ్రీనివాస్, నర్మద, జగన్ మోహన్, ఆంజనేయులు నరేందర్, స్నేహ ఎన్జీవో సభ్యులు లింక్ వర్కర్లు ఎస్ ఎస్ కె సిబ్బంది, స్థానిక కమ్యూనిటీ, వైద్యసిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీసులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# అధికార పార్టీ ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకుంటున్నారు

- రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ ఆనయకులు అడికే మహేందర్






**గండిపేట(క్రైం మిర్రర్):** అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధి పనులు నిర్వహించకుండా కేవలం శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకుంటున్నారని రంగారెడ్డి జిల్లా బీజేపీ సీనియర్ ఆనయకులు అడికే మహేందర్ ఆరోపించారు. అత్తాపూర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడలో ఫిబ్రవరి 19వ తేదీన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సుమారు 27.40 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, కంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఇంకా పది రోజుల్లో వర్షాకాలం స్టార్ట్ కాబోతున్నందున ప్రజలు చాలా ఇఇబ్బందిపడవలసింది వస్తుందన్నారు. శంకుస్థాపన చేసి మూడు నెలలు అవుతున్న ఇప్పటి వరకు రోడ్డు పని స్టార్ట్ చేయకపోవడం దానిపై ప్రజాప్రతినిధులు గానీ అధికారులు గానీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని స్థానికులు వెల్లడిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనైనా సీసీ రోడ్డు పని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# హిమగిరి కాలనీలో ఉచిత వైద్య శిభిరానికి విశేష స్పందన

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజలు తమ ఆరోగ్యాలపై జాగ్రత్తలు వహించాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు వినయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేంద్రబాబులు పేర్కొన్నారు. హిమగిరికాలనీ, కేకేనగర్1లోని సాయిబాబా ఆలయంలో ఆదివారం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది అనే నినాదంతో కాలనీ ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఈ శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరంలో ప్రముఖ వైద్యశాలల సహకారంతో ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్య పరీక్షలు అందించారు. శాలిని కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన సూచనలు చేశారు. ఒమిక్రాన్ హాస్పిటల్స్ వారి సౌజన్యంతో షుగర్, బీపీ, ఇతర జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా డాక్టర్ కన్సల్టేషన్ కల్పించారు. అవసరం ఉన్న వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వంశీ, శాంతి ఎస్టేట్స్ అధ్యక్షులు రామన్న, ఇండస్ వ్యాలీ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, కేకేనగర్1 అధ్యక్షులు రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు కిషోర్‌లు పాల్గొన్నారు.




# హిందూ ధర్మ రక్షణ, సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి - అభయ హిందూ సేన వ్యవస్థాపకులు సనాతన ధర్మ ప్రచారకులు రాధా మనోహర్ దాస్

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** హిందూ ధర్మ రక్షణ, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అభయ హిందూ సేన వ్యవస్థాపకులు, సనాతన ధర్మ ప్రచారకులు రాధా మనోహర్ దాస్ తెలిపారు. శనివారం రాత్రి శివరాంపల్లి నిర్వహించిన "హిందూ సమ్మేళనం" కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనం భక్తి, ఐక్యత, హిందూ ధర్మ చైతన్యంతో ఘన విజయాన్ని సాధించే విధంగా జరిగింది. గ్రామ ప్రజలు, యువత, మహిళలు హిందూ సేవా బృందాలు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సమాజ ఐక్యత, సంస్కృతి పరిరక్షణ, స్వధర్మ ఆచరణ, సేవా భావం వంటి అంశాలపై ప్రముఖులు ప్రసంగించారు.ఈ సమ్మేళనం లో డా. అన్నదాన సుబ్రహ్మణ్యం, డా. శ్రీమతి ఆశా జోషి, హిందూ సమాజం ఐక్యంగా




ముందుకు సాగాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి శివరాంపల్లి గ్రామస్తునికి నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# "వరి కొయ్య కు నిప్పు-తృటిలో తప్పిన భారీ నష్టం

**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** వరి కొయ్యకు నిప్పు పెట్టడంతో సమీపంలోని మామిడి తోటకు మంటలు వ్యాపించి భారీ నష్టం తృటిలో తప్పింది.వివరాలలోకి వెళ్తే మండల పరిధిలోని వెంకేపల్లి లో ఓ వ్యవసాయ తన పొలంలోని వరి కొయ్యలకు నిప్పంటించగా గాలి వాటం తోడై పక్కన ఉన్న రైతుల పొలాలలోని కొయ్యలు కాలు కొంటూ సుమారు 40 ఎకరాల వరకు మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానిక రైతులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఈ ప్రమాదంలో తొనుకునూరి ఉప్పలయ్య కు చెందిన పలు మామిడి,చింత చెట్లు తో పాటు ఎనగందుల లింగయ్య కు చెందిన మోటార్ స్టార్టర్ పూర్తిగా దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. వరి కొయ్య కాలిన



ప్రదేశాన్ని స్థానిక సర్పంచ్ ఇమ్మడి జయకుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తొనుకునూరి సైదులు గౌడ్ పరిశీలించారు.రైతులు నిర్లక్ష్యంగా వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దని హెచ్చరించారు.

# వసంత నగర్ డివిజన్ లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

- సద్వినియోగం చేసుకున్న పరిసర ప్రాంతాల ప్రజలు
- క్యాన్సర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి
- టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్‌పల్లి, మే 17 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గం, వసంతనగర్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ ఫేజ్-2 లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం అత్యంత విజయవంతంగా ముగిసింది. ప్రముఖ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో, బండి రమేష్ సహకారంతో, మాకినేని యాకనారాయణ (వినోద్) - విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలలోని కాలనీల నుండి సుమారు 200 మందికి పైగా ప్రజలు తరలివచ్చి ఈ ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. బసవతారకం ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం రోగులకు ఎంతో ఓపికగా పరీక్షలు నిర్వహించి, క్యాన్సర్ పట్ల అవగాహన కల్పిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. వైద్యుల సేవలను కాలనీ ప్రజలు ప్రత్యేకంగా కొనియాడారు.

**ముఖ్య అతిథుల అభినందనలు**

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ సమాజంలో క్యాన్సర్ పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ఇంతటి ఉత్తమ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన మాకినేని యాకనారాయణ (వినోద్)ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు అరవింద్ రెడ్డి, గంధం రాజు, చావ శ్రీనివాస్, కిలారు శ్రీనివాస్ బాబు, గాలి బాలాజీ, దినేష్ కుమార్ తదితరులు పాల్గొని, శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు మాకినేని యాకనారాయణ (వినోద్) మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్ మహమ్మారి పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ముందస్తు పరీక్షల ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలన్నదే మా సంకల్పం. ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజలందరికీ, అద్భుతమైన సేవలు అందించిన బసవతారకం ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే అహర్నిశలు శ్రమించి ఈ క్యాంప్‌ను విజయవంతం చేసిన వాలంటీర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మీ అందరి ఆశీస్సులు, సహకారం ఇలాగే కొనసాగాలని ఆయన కోరారు.

